క్లుప్తంగా

8న పుష్పగిరి మఠంలో వరలక్ష్మీవ్రతం



మాట్లాడుతున్న వేదం హరిప్రసాద్

తిరుపతి కల్చరల్ : మంగళం రోడ్డులోని పుష్పగిరి మఠంలో ఈనెల 8వ తేదీన సాయంత్రం 4 గంటలకు సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహించనున్నట్లు జిల్లా బ్రాహ్మణ సంఘాల సేవా సమితి ప్రతినిధులు నరసింహాచార్య, వేదం హరిప్రసాద్ తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. శ్రావణ మాసంలో వరలక్ష్మీదేవి పూజ నిర్వహిస్తే శ్రీమహాలక్ష్మి అనుగ్రహం పొందవచ్చని తెలిపారు. హిందువులందరూ వ్రతంలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. సమితి ప్రతినిధులు తులసీ రామ శర్మ, కొత్తపల్లి విజయకుమార్, రెడ్డి ప్రకాష్, మహేష్, గంగాధర్, సురేష్ పాల్గొన్నారు.

యోగానందరెడ్డికి మాతృవియోగం



యోగానంద రెడ్డిని పరామర్శిస్తున్న భూమన, మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు యోగానందరెడ్డి మాతృమూర్తి ఎన్.ధనమ్మ శనివారం కన్నుమూశారు. ఈ మేరకు సమచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆదివారం రామచంద్రాపురం మండలం నడవలూరులోని యోగానందరెడ్డి నివాసానికి వెళ్లి ధనమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించారు. కుటుంబీలకును పరామర్శించారు.

సత్సంగంతో దేవుని కృపాకటాక్షం



మాట్లాడుతున్న స్వామి సుకృతానంద

తిరుపతి కల్చరల్ : సత్సంగం ఆచరణతో దేవుని కృపాకటాక్షాలు పొందవచ్చని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి సుకృతానంద తెలిపారు. ఆదివారం ఇస్కాన్ రోడ్డులోని రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో 10వ వార్షికోత్సవం ప్రారంభించారు. స్వామీజీ మాట్లాడుతూ ఆధ్యాత్మిక జ్ఞానం పంచేందుకే రామకృష్ణ మిషన్ స్థాపించారన్నారు. భగవన్నామ స్మరణతో జీవితాలను సాఫల్యం చేసుకోవాలని కోరారు. నెల్లూరు ఆశ్రమ కార్యదర్శి స్వామి హృదానందజీ మాట్లాడుతూ గృహస్తులకు శ్రీరామకృష్ణ ఉపదేశం వివరించారు. తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షులు గంగవరం శ్రీదేవి, పారిశ్రామిక వేత్త భాస్కరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల రామకృష్ణ మిషన్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందించారు.

మహిళా వర్సిటీ విద్యార్థినుల ప్రతిభ



ట్రోఫీతో మహిళా జట్టు సభ్యులు

తిరుపతి ఎడ్యుకేషన్ : చెన్నైలో నిర్వహించిన ఆల్ ఇండియా టెన్నిస్ బాల్ క్రికెట్ చాంపియన్‌షిప్‌లో నిర్వహించారు. ఏపీ మహిళా జట్టు తృతీయ స్థానంలో నిలిచినట్లు చిత్తూరు జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మనోహర్ ఆదివారం తెలిపారు. ఇందులో పద్మావతి మహిళా వర్సిటీ క్రీడాకారులు రమ్య, గౌతమి, శ్రీలక్ష్మి, సూర్యకళ, కోమల కీలకపాత్ర పోషించారని వెల్లడించారు.

అవార్డు గ్రహీతకు అభినందన



శివకుమార్‌ను సన్మానిస్తున్న అధికారులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ : కేంద్ర బాల సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ అభినందన సభను ఆదివారం ఎస్వీయూ సెనెట్‌హాల్‌లో నిర్వహించారు. ప్రాచ్య పరిశోధన సంస్థ, శ్రీకృష్ణదేవరాయ సత్సంగ్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఎస్వీయూ వీసీ అప్పారావు మాట్లాడుతూ బాలసాహిత్యం నేటి సమాజానికి అవసరమని తెలిపారు. బాల సాహిత్య వేత్త శివకుమార్‌ను కేంద్ర బాల సాహిత్య అకాడమీ అవార్డు వరించడం అభినందనీయమన్నారు. ఆయన రచించిన పుస్తకాలలో కుటుంబ విలువలు, నైతికత, సమాజం విశిష్టత ఉట్టిపడుతోందని వెల్లడించారు. రిజిస్ట్రార్ అప్పారావు, అవధాని మేడసాని మోహన్, ప్రొఫెసర్ పీసీ వెంకటేశర్లు, ఆచార్య గోవింద రాజు, జక్కంపూడి మునిరత్నం, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ రామలింగయ్య, డాక్టర్ రాసాని, బాలాజీ, కృష్ణస్వామి మల్లీశ్వరావు పాల్గొన్నా

కదలడు..వదలడు!



నిత్యం కళ్లెదుట కదలాడే కాసులు. కదిలినా.. మెదిలినా ముంగిట రాలే సొమ్ములు. ప్రతి నెలా రూ.లక్షల్లో ఆదాయం సమకూర్చే విధులు. ఇంత కంటే ఏం కావాలి అనుకున్నాడు ఆ అధికారి. ఉద్యోగోన్నతి వచ్చినా సీటు వదిలేందుకు ససేమిరా అనేశారు. పైసా వసూల్ ముందు ప్రమోషన్ ఓ లెక్కా అంటూ పోస్టును పట్టుకునే వేలాడుతున్నారు. సుమారు 17 ఏళ్లుగా ఒకే స్థానంలో పాతుకుపోయారు. ఆయనను మార్చాలంటే ఉన్నతాధికారులు సైతం హడలిపోతున్నారు. సదరు అధికారి మాటనే శిరోధార్యంగా భావిస్తున్నారు.

- 17ఏళ్లుగా ఒకే పోస్టులో విధులు
- ఉద్యోగోన్నతి వచ్చినా.. అదే సీటును వదలని వైనం
- ఉన్నతాధికారులైనా ఆయన మాటకు తలవంచాల్సిందే
- ఏమి 'సేతు'రా లింగా అంటూ నెట్టింట వైరల్

తిరుపతి తుడా : నగరపాలక సంస్థ కార్యాలయంలో రెవెన్యూ ఆఫీసర్ పోస్టుకు విపరీతమైన డిమాండ్ ఉందిన. ప్రధాన ఆదాయ వనరుగా ఆ స్థానానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. కంటికి కనిపించకుండా నెలవారీగా ముడుపుల రూపంలో రూ.లక్షలు వస్తుండడంతో రెవెన్యూ ఆఫీసర్ పోస్టులోనే ఉండేందుకు ఆ అధికారి ఎంతవరకైనా వెళుతున్నారు. గడచిన 17ఏళ్లుగా కార్పొరేషన్‌లో రెవెన్యూ ఆఫీసర్‌గా ఏలుతున్నారు. 2009లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూనే తన పలుకుబడితో అర్హత లేకున్నా ఇన్‌చార్జి రెవెన్యూ ఆఫీసర్‌గా కుర్చీలో కూర్చున్నారు. అప్పటి నుంచి అవినీతి సొమ్ము రుచి చూసిన ఆయన ఆ పోస్టును వదులుకునేందుకు ఇష్టపడడంలేదు. 2012లో సీనియర్ అసిస్టెంట్ నుంచి సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి పొందిన రోజు నుంచే పూర్తి స్థాయి రెవన్యూ ఆఫీసర్ సీట్‌ను ఆక్రమించుకున్నారు. 2015 నుంచి 2021వరకు రెవెన్యూ ఆఫీసర్–2 పోస్టులోకి మరో అధికారిని రానివ్వకుండా చక్రం తిప్పారు. 2021లో సూపరింటెండెంట్ స్థాయి నుంచి ఆయన మేనేజర్‌గా ప్రమోషన్ పొందారు. ప్రస్తుతం మేనేజర్‌గా ప్రభుత్వం నుంచి లభించే అన్ని బెనిఫిట్స్‌ను పొందుతూ కింది పోస్టులోనే ఉండేందుకు ఆయన మొగ్గు చూపుతున్నారు. 4ఏళ్లుగా తన సొంత పోస్టును కాదని రెవెన్యూ ఆఫీసర్‌గానే కొనసాగుతుండడం కార్యాలయంలో చర్చనీయాంశమైంది.

ఎవరైనా తలవంచాల్సిందే!

రెవెన్యూ ఆఫీసర్‌గా బాధ్యతలను మరొకరి చేతికి చిక్కకుండా చక్రం తిప్పుతున్న ఆ వ్యక్తి ఉన్నతాధికారులను సైతం బోల్తా కొట్టించడంలో దిట్ట. ఎంతటి కచ్చితంగా ఉండే అధికారి అయినా అయన మాయమాటలకు పడిపోవాల్సిందే. తిమ్మిని బమ్మిని చేసి ఇతరులపై చాడీలు చెప్పి.. ఇక కార్యాలయంలో ఆయనంతటి వాడు మరొకరు లేరనే విధంగా కలరింగ్ ఇస్తుంటారు. ఆయన మాటలకు ఎంతటి అధికారినైనా తలవంచేలా చేసుకోవడంలో నేర్పరి. ఇదిలా ఉంటే ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో ముందుగా తెలియదు కాబట్టి, ఎన్నికల సమయంలో ఇరుపార్టీల నేతలతో సత్సంబంధాలను కొనసాగిస్తుంటారు. గత సార్వత్రిక ఎన్నికలలో మరో పార్టీతో అంటకాగినట్టే ఉంటూ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థికి ఎన్నికల ఫండ్‌ను సమకూర్చారనే ప్రచారం జోరుగా సాగింది. ఏళ్ల తరబడి సంపాదించిన అక్రమ సొమ్ముతో రాజకీయ నేతలకు ఎర వేస్తూ, అధికారులు కాలుతో చెప్పిన పనులను డబ్బుతో చక్కబెడుతూ ఆర్‌ఓగా దూసుకుపోతున్నారు. 2009 నుంచి ఆయన ఇదే చతురతను ప్రదర్శిస్తూ 17ఏళ్లుగా ఆ పోస్టును అనుభవిస్తున్నారు. కార్పొరేషన్‌లో 8మంది సూపరింటెండెంట్‌లు ఆర్‌ఓ పోస్టులో ఒక రోజు కూడా కూర్చోకుండానే ఉద్యోగ విరమణ పొందారు.

సోషల్ మీడియాలో వైరల్

రెవెన్యూ ఆఫీసర్–1 వ్యవహార శైలిపై ఒకరిద్దరు అధికారులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం, ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఏమి 'సేతు'రా లింగా అంటూ నెట్టింటి వైరల్ చేశారు. రాజకీయ నాయకులతో ఆయనకు ఉన్న సత్సంబంధాలు, ప్రమోషన్, అక్రమ సంపాదనపై దుమ్మెత్తి పోస్తున్నారు. రెవెన్యూ ఆఫీసర్‌గా ఎంతోమందికి అర్హత ఉన్నా ఉద్యోగోన్నతి పొందిన వ్యక్తిని కింది పోస్టులో ఎలా కొనసాగిస్తారంటూ బహిరంగ లేఖలు, సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ కార్పొరేషన్ అధికారులను నిలదీస్తున్నారు.

అధైర్య పడకండి..అండగా ఉంటాం



శివరామయ్య భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మోహిత్‌రెడ్డి



ఈశ్వరయ్యను పరామర్శిస్తున్న మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : పచ్చమూక దాడిలో గాయపడిన కొత్తవడ్డిపల్లి ఉప సర్పంచ్ ఈశ్వరయ్యను వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం పాకాల మండలం మద్దినాయనపల్లె పంచాయతీ కొత్తవడ్డిపల్లెలోని ఈశ్వరయ్య నివాసానికి వెళ్లి మాట్లాడారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని భరోసా కల్పించారు. వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకునే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన బండి చెంగల్రాయులు ఇంటికి వెళ్లి ఆయన కుమారుడు, కోడలుకు వివాహ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే దామల చెరువులో పాకాల మండల కో–ఆప్షన్ సభ్యుడు కాజా మస్తాన్‌ను పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు నంగా నరేష్ రెడ్డి, నేతలు మొగరాల హరి ప్రసాద్ రెడ్డి, కపిలేశ్వర్ రెడ్డి, భాస్కర్ నాయుడు, భాను, రహీంబాయ్ పాల్గొన్నారు.

తిరుపతి రూరల్ : వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆదివారం పలువురు నేతలను పరామర్శించారు. రామచంద్రాపురం మండలం తిమ్మరాజుపల్లె దళిత వాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత చంద్రబాబు సోదరుడు శివరామయ్య మృతి చెందడంతో ఆయన పార్థివ దేహానికి పూల మాల వేసి అంజలి ఘటించారు. అలాగే తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం గ్రామానికి చెందిన పార్టీ నేత అలత్తూరు నిరంజన్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఓదార్చారు. ఈ క్రమంలోనే కె.శివశంకర్‌రెడ్డి మృతితో బాధపడుతున్న కుటుంబీకులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన ఆదెం చెంచురామిరెడ్డి, ఆదెం రఘురామిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా వారిని పరామర్శించారు.

కర్ణాటక గవర్నర్‌కు స్వాగతం



గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్

తిరుమల : శ్రీవారి దర్శన నిమిత్తం తిరుమల పర్యటనకు విచ్చేసిన కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్‌కు టీటీడీ ఓఎస్‌డీ ఎంఎస్ నాయక్, అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు నుంచి ఆయన గౌరవ వందనం అందుకున్నారు.

ఉచిత వైద్య సేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తిరుపతి కల్చరల్ : సాధన మహిళా అభ్యుదయ సంఘం, ఎంఎస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఇందిరానగర్‌లో ఆదివారం ఉచిత వైద్య సేవలు అందించారు. ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ ఆంజనేయులు, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రావూరు ప్రసాద్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ముగిసిన మహాభారత ఉత్సవాలు

తిరుపతి రూరల్ : మండలంలోని దుర్గసముద్రం గ్రామంలో 18 రోజులుగా జరిగిన మహా భారత ఉత్సవాలు ఆదివారం దుర్యోధనవధతో ముగిశాయి. ఈ సందర్భంగా ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి వారికి వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సారె సమర్పించారు. ఆలయ ధర్మకర్త మిట్టపల్లి ప్రసాదరెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేయించారు.

తిరుపతి ఎస్వీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు





తిరుపతి ఎస్‌పీజేఎన్‌ఎంహెచ్ స్కూల్ 1984-85 బ్యాచ్..

అపూర్వ సమ్మేళనం

తిరుపతి, చంద్రగిరిలోని పలు పాఠశాలల పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం వేర్వేరుగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పరస్పరం ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. కుటుంబాల స్థితిగతులను తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సత్కరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని మురిసిపోయారు. ఆటపాటలతో సందడి చేసి ఆత్మీయ విందును ఆరగించారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించుకున్నారు.

– చంద్రగిరి/ తిరుపతి సిటీ/ తిరుపతి కల్చరల్/ తిరుపతి రూరల్



పెరుమాళ్లపల్లె ఉన్నత పాఠశాల 1985-86 బ్యాచ్ విద్యార్థులు



చంద్రగిరి ప్రభుత్వ పాఠశాల 1974-75 పదోతరగతి పూర్వ విద్యార్థులు



తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ 1983-84 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

వైభవంగా 'రుద్ర ఏకాదశి వైదికం'



అధ్యాపకులను సన్మానిస్తున్న సాదు భద్రేశ స్వామి

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీలో భాషోత్సవం అనే అంశంపై మూడు రోజులపాటు నిర్వహించనున్న జాతీయ సదస్సు ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి స్వామి నారాయణ సంప్రదాయ అక్షరధామ అధ్యక్షుడు సాదు భద్రేశ స్వామి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అద్వైత వేదాంత విభాగం అధ్యక్షుడు ప్రొఫెసర్ గణపతి భట్ ఆధ్వర్యంలో అక్షర పురుషోత్తమ మండపంలో ద్వాదశ కలశ స్థాపన నిర్వహించారు. అనంతరం రుద్ర ఏకాదశి వైదిక కార్యక్రమంలో భాగంగా హోమం, ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ క్రమంలోనే దర్శన విభాగ అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి, ఉత్కల పీఠం డైరెక్టర్ డాక్టర్ జ్ఞానరంజన్ పాల్గొన్నారు.

వాకర్స్‌కు వైద్య పరీక్షలు

తిరుపతి కల్చరల్ : కరకంబాడి రోడ్డులోని వినాయక సాగర్ పార్క్ ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సంకల్ప హాస్పిటల్ డాక్టర్ లావణ్య, భార్గవి డెంటల్ హాస్పిటల్ డాక్టర్ భార్గవి ఆధ్వర్యంలో వాకర్స్‌కు వైద్య పరీక్షలు చేపట్టి మందులు పంపిణీ చేశారు. వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సాంబశివారెడ్డి, కృష్ణమూర్తి, రామకృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, రామమూర్తి రాజు, వెంకట్ రాయల్, సాయి, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.



వాకర్స్‌కు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నోటీస్ బోర్డు

- కలెక్టరేట్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక.
- జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఉదయం 10 గంటలకు భాషోత్సవం పేరుతో జాతీయ సదస్సు.
- నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గ్రీవెన్స్, 10.30 నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్.
- స్విమ్స్‌లోని శ్రీపద్మావతి హాస్పిటల్ పీడియాట్రిక్ ఓపీ విభాగంలో ఉదయం 10 గంటలకు తల్లిపాల వారోత్సవంపై అవగాహన సదస్సు.
- ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాలలో 2025–26 ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం.

నేడు చంద్రగిరిలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'

చంద్రగిరి : చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను వివరిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని సోమవారం చంద్రగిరిలో నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం 3.30 గంటలకు స్థానిక వైఎస్ఎంఆర్ కల్యాణమండపంలో జరగనున్న కార్యక్రమానికి పార్టీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హాజరుకానున్నట్లు వెల్లడించారు. పెద్దసంఖ్యలో నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

పీఆర్‌సీ ఏర్పాటుకు డిమాండ్

తిరుపతి సిటీ : ప్రభుత్వం వెంటనే 12వ వేతన సవరణ సంఘం ఏర్పాటు చేయాలని, 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేటు కోచింగ్ సెంటర్‌లో జిల్లా ఏపీటీఎఫ్ విస్తృత కార్యవర్గ సమావేశం నిర్వహించారు. చిరంజీవి మాట్లాడుతూ పెండింగ్ డీఏలను సైతం తక్షణం విడుదల చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమేష్, అఖిలభారత విద్యాసంఘాల చీఫ్ సుబ్బారెడ్డి, జి.చెంగల్రాయులు, ఎస్.సురేష్ పాల్గొన్నారు.

అలరించిన నృత్యం



కళాకారుల నృత్య ప్రదర్శన

చంద్రగిరి : తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆదివారం తిరుపతికి చెందిన సాయినాథ్ శిష్య బృందం ఆధ్వర్యంలో చిన్నారుల కూచిపూడి, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. వివిధ పాటలు, కీర్తనలకు చిన్నారులు మిథున, వర్షిణి, పవిత్ర, చదుర, గగన, హేమశ్రీ, జనని, ఆద్య చక్కటి హావభావాలతో ప్రదర్శించిన నాట్యానికి ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. అనంతరం కళాకారులను ఏట సూర్యతేజ సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు.

తుంబుర తీర్థంలో కలెక్టర్



తుంబురతీర్థంలో కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుమల : తిరుమలలోని తుంబుర తీర్థాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ సందర్శించారు. తుంబుర తీర్థం రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో ఉండడంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెళ్లేందుకు చేపట్టాల్సిన చర్యలను అటవీశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

పాకాల : మండలంలోని పేరసానిపల్లెలో ఆదివారం అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. కుమ్మరపల్లి గ్రామానికి చెందిన చీకటిపల్లి రెడ్డెప్ప(56) మధ్యాహ్నం చికెన్ బిరియాని, చికెన్ పకోడీ తిన్నాడు. అనంతరం తాంబూలం వేసుకుని పశువులకు గడ్డి కోసేందుకు పొలానికి వెళ్లాడు. అకస్మాత్తుగా వాంతులు, ముక్కు నుంచి రక్తం కారడంతో అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. రెడ్డెప్ప ఫుడ్ పాయిజనింగ్ కారణంగా మృతి చెందినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సీఐ సుదర్శన్‌ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.